11వ పాఠం	జూన్ 4-10

# కలలు కనిన యోసేపు

## సబ్బాతు మధ్యాహ్నము	జూన్ 4

**ఈ వారమునకు చదువ వలసిన వాక్యములు :ఆది 34; మత్తయి 20:26,27; అపొ.కా.7:9; ఆది 38, 39, 40:1-41:36.**

**కంఠతవచనం : "వారు ఇదిగో ఈ కలలు కనువాడు వచ్చుచున్నాడు" (ఆది 37:19).**

యోసేపు యొక్క చరిత్ర (ఆది 37–50) ఆదికాండము యొక్క చివరి భాగమైయున్నది. కానానులో అతని మొదటి కల నుండి (ఆది 37:1–11) అతడు ఐగుప్తులో మరణించు వరకు ఆది 50:26లో ఉంది. ఆదికాండ గ్రంథములో మరే ఇతర పితరుడు ఆక్రమించనంత స్థలమును యోసేపు ఆక్రమించాడు. యోసేపు యాకోబు యొక్క 12 మంది కుమారులలో ఒకడుగా ఉన్నప్పటికి అతడు అబ్రహాము, ఇస్సాకు మరియు యాకోబు వంటి గొప్ప పితరుడుగా ఆదికాండము చూపిస్తుంది.

మనము చూస్తున్నట్లుగా, యోసేపు జీవితము వేదాంత శాస్త్రమునకు చెందిన రెండు ముఖ్య విషయాలను ప్రధానముగా చూపుతుంది. మొదటగా దేవుడు తన వాగ్దానమును నెరవేర్చెను. రెండవది, దేవుడు దుర్మార్గమును మంచిదిగా మార్చగలడు.

ఈ వారము అధ్యయనము యోసేపు యొక్క ప్రాథమిక జీవితము గూర్చి చదువుకొనబోవుచున్నాము. అతడు యాకోబుకు ఇష్టుడైన కుమారుడు. అతనికి 'బ అల్ హకలోమోట్' అనగా 'కలలు కనువాడు' అని అతనిని చనువుగా పిలిచేవారు (ఆది 37:19). అనగా కలలు కనడములో ఆరితేరినవాడనే అర్థానిస్తుంది. ఈ పేరు అతనికి సరిగ్గా సరిపోతుంది. ఎందువలనంటే అతడు కలలు కనడమే కాదు గాని, వాటిని అర్థము చేసుకొనగలడు మరియు ప్రవచనమునకు సంబంధించిన కలలను వివరించగలడు. అతడు తన జీవిత కాలములో నెరవేర్చిన వాడు కూడాను.

ఈ అధ్యాయములో మరొకసారి మానవుని యొక్క దుర్మార్గము ఎంతటిదైనను దేవుని యొక్క భవిష్యత్తు విషయాలను ఎవరూ ఆపలేని స్థితిలో నెరవేరడము దేవుని యొక్క నడిపింపుయైయుంది.

–జూన్ 11, సబ్బాతు దినమున ఈ వారం పాఠమును అధ్యయనం చేయుటకు సిద్ధపడుడి.

ఆదివారం జూన్ 5

## కుటుంబ సమస్యలు

యాకోబు చివరికి కానాను దేశములో నివాసము ఏర్పాటు చేసుకున్నాడు. తన తండ్రియైన ఇస్సాకు “ఒక పరదేశిగానే జీవించాడు. యాకోబు ఆదేశములో నివసించెను” (ఆది 37:1) అని ఈ వాక్యము సెలవిచ్చుచున్నది. అతడు భూమి మీద నివాసము ఏర్పాటు చేసుకొనుచుండగా మరొకసారి కుటుంబములో సమస్యలు తలెత్తాయి. ఈ భూమిని స్వాధీనము చేసుకొనే విషయములో సమస్యరాలేదు లేక అక్కడ వున్న బావి నీళ్ళు వాడుకొనే విషయములో సమస్య రాలేదు గాని ఆ సమస్య ముఖ్యముగా ఆధ్యాత్మికమైనది.

**ఆది 37:1-11 చదువుడి. కుటుంబములో ఏర్పడిన ఏ సమస్యను బట్టి యోసేపు యొక్క సహోదరులు అతడిని అంతగా ద్వేషించారు?**

..............................................................................................................

ఆరంభము నుండి కూడా, యాకోబు యొక్క వృద్ధాప్యములో పుట్టిన కుమారుడైన యోసేపు (ఆది 37:3) తన తండ్రితో ప్రత్యేక అనుబంధము కలిగియున్నాడు. అతడిని కుమారులందరికంటే ఎక్కువగా ప్రేమించాడు (ఆది 37:4) అతని కొరకు ప్రత్యేకమైన మరియు విచిత్రమైన నిలువుటంగీ కుట్టించాడు. యువ రాజు ధరించిన వస్త్రమువలె ఆ అంగీ ఉన్నది. (2సమూ 13:18) ఆవిధముగా చేయుట ద్వారా రాహేలు యొక్క మొదటి కుమారునికి జ్యేష్ట కుమారుని హోదా యిచ్చినట్లు రహస్యముగా యోసేపును హెచ్చించెను.

భవిష్యత్తులో యాకోబు యొక్క కోరిక మేర, యోసేపు జ్యేష్ట కుమారుని హోదా నిర్ణయించబడెను (1దినవృ 5:2) అందుచేత అతని సహోదరులందరు అతనిని ద్వేషించి సమాధానముతో మాట్లాడుటకు కూడా వారు ఇష్టపడలేదు (ఆది 37:4).

దానికి తోడు యోసేపు తన సహోదరుల ప్రవర్తన లోపాలను ఎత్తి చూపిస్తూ వారి తండ్రికి ఫిర్యాదు చేస్తూ వుండేవాడు (ఆది 37:2) ఆ స్వభావము తన సోదరులకు ఇష్టమయ్యేది కాదు.

యోసేపు తనకు కలిగిన కలలను తన సోదరులతో పంచుకొనేటప్పుడు దేవుడు అతడిని వారికంటే ఉన్నతమైన స్థానములో నిలువబెట్టాడనియు, తన సోదరులందరు అతడికి నమస్కారము చేయుచున్నారని చెప్పినపుడు అతనిని ఇంకా ఎక్కువ ద్వేషించుట మొదలు పెట్టారు. యోసేపునకు కలిగిన కలలు ప్రవచనమునకు సంబంధించినవి

గనుక, అది అనేకసార్లు తిరిగి కలలుగా రావడము వలన అవి సూచించుచున్న భవిష్యత్తు సంఘటనలు నిజముగా సంభవిస్తాయనే విషయము రూఢిపరచబడేవి (ఆది 41:32). యాకోబు ఆ విషయములో బహిరంగముగానే గద్దించినను (ఆది 37:10). ఆ సంఘటనను తన మనస్సులో పెట్టుకొని, దాని యొక్క నెరవేర్పు కొరకు ధ్యానించుచు ఎదురు చూసేవాడు (ఆది 37:11). తనకు కలుగుచున్న కలలన్నింటిని ఏదో లోతైన భావము, లక్ష్యము ఉండి తీరుతుందని అతడు భావించియుండవచ్చు. అవును ఆ సమయంలో అది ఏవిధంగా నెరవేరబోవుచున్నదో అతనికి తెలియకపోయినను వాస్తవానికి అది నిజమే అని తరువాత నిరూపణ అయ్యింది.

**మత్తయి 20:26,27 చదువుడి. ఇక్కడ బయలుపర్చబడిన ముఖ్యాంశమేమిటి? అది బోధిస్తున్న విషయాన్ని మన నిజ జీవితములో ఏవిధంగా చూపించగలము?**

సోమవారం జూన్ 6

## యోసేపు మీద దాడి జరిగెను

ముందుముందు జరుగబోవు సంఘటనలు ఎంత ఘోరముగా ఉండబోవుచున్నవో అర్ధము చేసుకొనుట కష్టమేమీ కాదు. వాటికి బహు సమీపముగాను లేక వాటితో సంబంధమున్న వారెవరైనా, ముందో వెనకో సమస్యలకు గురి కావడం తథ్యం. దానంతటికి కారణం ద్వేషము. అతడిని వారు ద్వేషించుచున్నారు గనుక ఆవిధముగా సంభవించినది.

**ఆది 37:12-36 చదువుడి. దుర్మార్గముతో నిండిన హృదయాలు ఎంత ప్రమాదకరమైనవిగా మారునో ఇక్కడ పేర్కొనబడిన విషయాల ద్వారా ఏమి నేర్చుకోగలము?**

..........................................................................................

దేవుని యొక్క అనుగ్రహము లేక దయ యోసేపు మీద ఉంది కాబట్టి అతనిని తన సహోదరులు ద్వేషించిరి (అపొ.కా.7:9) ముందు ముందు జరుగబోవు సంఘటనలలో దేవుడు చూపే దయ మెట్టు మెట్టుకు నిర్ధారణ అయ్యింది. యోసేపు తన మార్గమును తప్పిపోయినపుడు ఒక మనుష్యుడు అతనికి దారి చూపించాడు. (ఆది 37:15). యోసేపు సహోదరులు అతనిని చంపుటకు కుట్ర పన్నుచుండగ రూబేను మధ్యలో కలుగజేసుకొని, చంపుటకు బదులు ఒక గోతిలో వేయమని సలహా ఇచ్చాడు (ఆది 37:20-22).

ఇక్కడ అతని యెడల వ్యక్తపరచిన ద్వేషమును వర్ణించుట కష్టమే. ముఖ్యముగా ఎవరో కాదు తన సొంత కుటుంబీకులు ఆవిధంగా చేయుట చాలా శోచనీయమైన విషయమే. ఆ యౌవనస్తులు యోసేపు యెడల అంతకర్కశముగా ఎట్లు

ప్రవర్తించగలిగారు? వారి తండ్రి మీద దాని ప్రభావము ఏవిధంగా పనిచేస్తుందో కొన్ని నిమిషాలైనా వారు ఆలోచించలేదా? వారి తండ్రి యోసేపును ఎక్కువగా ప్రేమిస్తున్నాడనే కారణముతో, అతని సోదరులై యుండి, ఒకే కుటుంబములోని పిల్లలై యుండివారు ఎట్లు ప్రవర్తించగలిగారు? మానవులు ఎంత క్రూరముగా ఉండగలరో చూపించుటకు ఇది ఒక మంచి ఉదాహరణైయున్నది.

సోదరులలో కొందరు అతని యెడల పగ తీర్చుకొనే విషయములో ఇంకా తృప్తి చెందలేదు. అదే సమయములో వ్యాపారులు ఆ మార్గము గుండా రావడం వారు గమనించారు. యోర్దాను అవతల నుండి ఇష్మాయేలీయుల బృందము ఐగుప్తునకు వెళ్ళుచూ ఆ మార్గమును ఎంచుకున్నారు. వారి వెంబడి సుగంధ ద్రవ్యములు మరియు ఇతర వస్తువులు తీసుకొని వెళ్ళుచున్నారు. అతనిని గుంటలో త్రోసి అతని మరణానికి కారణమయ్యే బదులు అన్యజనాంగమైన వ్యాపారులకు అమ్ముట మంచిదని యూదా తలంచెను. వారేమి చేసినను అతని రక్తమునకు వారు బాధ్యులు కాకూడదనుకొనిరి" ఎలెన్ జి వైట్, పితరులు ప్రవక్తలు, పుట 211.

అతనిని ఒక గుంటలో త్రోసి తరువాత చంపివేయాలనే ప్రయత్నములో ఒక వ్యాపారుల గుంపును చూచి, వారికి యోసేపును అమ్ముటకు యూదా సలహా ఇచ్చెను. (ఆది 37:26,27) మిద్యానీయులకు యోసేపును అమ్మిన తరువాత (ఆది 37:28) వారు ఐగుప్తులో ఉన్న వ్యక్తికి యోసేపును అమ్ముట జరిగింది. ఆవిధముగా తన భవిష్యత్తు మహిమను వారు కోరుకున్నారు (ఆది 37:36).

**నీవు అటువంటి కార్యములను చేయడం నీకే ఇష్టము లేనప్పుడు, అటువంటి లక్షణాలు నీలో ఉంటే దేవుని సహాయమును కోరుట ఎందుకంత ప్రాముఖ్యము?**

మంగళవారం జూన్ 7

## యూదా మరియు తామారు

తామారు యొక్క వృత్తాంతము ఇక్కడ అవసరము లేనిది కాదు. ఐగుప్తులో యోసేపు అమ్మబడిన తరువాత వరుస క్రమములో ఈ సంఘటన జరిగియుంది.(ఆది 38:1) మరియు యూదా తన సోదరులతో విభేదించినందున అతడు వారిని విడిచి వెళ్ళిపోయెను. ఇక్కడ పేర్కొనబడిన ఈ వాక్యములో ఉన్న మాటలు మరియు కారణములు అంతకుముందున్న అధ్యాయములో కూడా కనిపించుచున్నవి. అనగా ఈ అధ్యాయము కూడా వేదాంత శాస్త్రమునకు చెందిన పాఠమును బోధించుచున్నదని దాని అర్ధమైయున్నది.

ఒక దుర్మార్గపు క్రియ రక్షణకు అనుకూలమైన సంఘటనగా మారిపోవచ్చును అనే విషయము అందులో ఉన్నది.

**ఆది 38 చదువుడి. కనానీయురాలైన తామారుతో యూదా ప్రవర్తనను పోల్చుడి. ఆ ఇరువురిలో ఎవరు ఎక్కువ నీతిమంతులుగా పరిగణింపబడిరి? ఎందువలన?**

కనానీయులలో నుండి యూదా ఒక భార్యను ఎంచుకున్నాడు (ఆది 38:2) ఆమెతో అతనికి ఏరు, ఓనాను, షేలా అని పేర్లు గల ముగ్గురు కుమారులు పుట్టారు. యూదా తన పెద్ద కుమారుడైన ఏరును తామారు అనే ఒక కనానీయురాలితో వివాహము చేసెను. ఒక క్రమమైన వంశావళి ఏర్పడుతుందని తామారుతో వివాహము చేసెను. ఏరు మరియు ఓనానుల యొక్క దుష్టత్వము వలన దేవుడు వారిని చంపివేసెను. అందువలన తామారుకు యూదా యొక్క మూడవ కుమారుడైన షేలా పెద్దవాడైనప్పుడు అతడు తన మరిది ధర్మమును నెరవేరుస్తాడని యూదా ఆమెకు వాగ్దానము చేసెను.

కొంత కాలమైన తరువాత యూదా తాను తామారుకు చేసిన వాగ్దానమును మరచిపోయాడు. ఈ లోగా యూదా భార్య మరణించుట యూదా తనను తాను ఓదార్చుకొనుటకు చూచుచుండగా తామారు వేశ్యవలె నటించి యూదా తనకు చేసిన వాగ్దానమును నెరవేర్చుకొనుటకు అతనితో వెళ్ళెను. తామారును యూదా గుర్తించలేదు. అతడు వేశ్య అనుకున్న తామారుకు చెల్లించుటకు డబ్బు లేనందున, ఆమెకు తన మేకల మందలో నుండి ఒక మేక పిల్లను పంపెదనని చెప్పెను. అందుకామె ఆ మేక పిల్లను పంపించే వరకు అతని వస్తువులలో ఏదైనా ఒకదానికి కుదువ పెట్టవలెనని ఆమె అడిగినప్పుడు, అతని ముద్రను దాని దారమును మరియు అతని చేతి కఱ్ఱను ఆమెకిచ్చెను.

ఆ విధముగా వారిరువురి మధ్య జరిగిన కలయిక వలన ఆమె గర్భవతియైనది. తరువాత కూడా ఆమెను జారత్వము చేసినదని నిందించినపుడు అతడు ఆమె యొద్ద కుదువ పెట్టిన వస్తువులను చూపించి, అవి ఎవరివో వాని వలననే నేను గర్భవతి నైతినని చెప్పినపుడు యూదా ఆ పరిస్థితులను అర్ధము చేసుకొని ఆమెకు క్షమాపణ చెప్పెను.

ఆ నీచమైన సంఘటన ద్వారా పెరెసు జన్మించెను అనగా "ఛేధించుకొని వచ్చెను" అని అర్ధము. అతడు యాకోబు వలె కవలలో రెండవ వానిగా జన్మించి మొదటివానిగ గుర్తింపబడెను. అతడు రక్షణ చరిత్రలో దావీదుకు పూర్వికుడు (రూతు 4:18-22) మరియు యేసేక్రీస్తుకు పూర్వికుడయ్యాడు (మత్త 1:3) తామారు విషయానికి వస్తే నలుగురు స్త్రీలలో ఆమె మొదటిది. ఆమె వెంబడి తరువాత వచ్చిన వారు . రాహాబు

(మత్త 1:15) రూతు (మత్త 1:5,6) మరియు ఊరియా యొక్క భార్య (మత్త 1:6) వీరందరు యేసు తల్లియైన మరియ వంశావళిలో ముందున్న వారు (మత్త 1:16).

ఈ వృత్తాంతము ద్వారా ఒక పాఠమును నేర్చుకొనగలము. దేవుడు తన కృప చొప్పున తామారును రక్షించి చెడును మంచిగా మార్పు చేసి, యేసు యొక్క సిలువ ద్వారా తన ప్రజలను రక్షించును. అదే రీతిగా యోసేపు విషయములో అతని వేదనలను యాకోబు మరియు అతని కుమారుల యొక్క రక్షణగా మార్చి వేయును.

బుధవారం జూన్ 8

## యోసేపు ఐగుప్తులో ఒక బానిస

"తామారు యొక్క సంఘటన వలన యోసేపు యొక్క కథనాలను గూర్చి తెలుసుకొనుటకు కొంత అంతరాయము కలిగినందున మరల యోసేపు చరిత్రను పరిశీలిద్దాము. ఇప్పుడు యోసేపు ఒక బానిసగా రాజు ఖైదీలు బంధింపబడు చెరసాల యొక్క సేనాధిపతి ఇంటిలో పనిచేయుచున్నాడు" (ఆది 40:3,4; 41:10-12).

**ఆది 39 చదువుడి. రాజ సంరక్షక సేనాధిపతియునైన పోతీఫరు క్రింద అతని ఇంటి మీద విచారణకర్తగా యోసేపు పని చేయుచున్నాడు. ఆ విధముగా యోసేపు ఇంత విజయమును సాధించుటకు అతని నడిపించిన కారణాలేమిటి?**

..........................................................................................

యోసేపు ఏ పని చేసినను అందులో వర్ధిల్లుచున్నాడనే పేరు వెంటవెంటనే అతనికి వచ్చింది (ఆది 39:,2,3) అతడు చాలా మంచివాడుగా ఉన్నందున అతని యజమానుడైన పోతీఫరు యోసేపును నమ్మి తన ఇంటి మీద విచారణకర్తగా నియమించెను (ఆది 39:4).

యోసేపు తన పనిలో వర్ధిల్లుచున్నను అతడు అవినీతిపరుడు కాలేదు. పోతీఫరు భార్య యోసేపును చూచి అతనికి ఆకర్షితురాలై ఆమెతో నిద్రించాలని బలవంతము చేసినప్పుడు అతని ఆ ఉద్యోగము పోయినప్పటికి మంచిదే అనుకొని ఆమె కోరికను తిరస్కరించెను.

"ఇంత ఘోరమైన దుష్కార్యము చేసి దేవునికి విరోధముగా ఎట్లు పాపము చేయుదును" అని చెప్పెను (ఆది 39:9). యోసేపు యొక్క తిరస్కారమువలన ఆ స్త్రీ అవమానముగా భావించి తన ఇంటిలో ఉన్న ఇతర సేవకులకును మరియు ఆమె భర్తకును యోసేపు మీద అబద్ధములు చెప్పెను. దానికి ఫలితముగా యోసేపు చెరసాలలో

బంధింపబడెను.

కష్ట కాలములో దేవుడు విడిచి పెట్టేసాడు అనే భావము యోసేపునకు కలిగినట్లే మనకందరికి కలిగియుండ వచ్చును. "అయితే అటువంటి పరీక్ష సమయములో కూడా యెహోవా యోసేపునకు తోడై యున్నాడు" (ఆది 39:21).

చివరికి దేవుడు తన పక్షమున పని చేయుట వలన జైలు అధికారితో యోసేపునకు సంబంధము అనుకూలముగా మారింది. తన యజమాని గృహములో దేవుడు యోసేపును వర్ధిల్లచేసినట్లు ఇక్కడ కూడా దేవుడు అతనిని ఆశీర్వదించెను. అతడు బానిసగా ఉన్నప్పటికి తానున్న స్థితిలోనే తనకు అనుకూలముగా పరిస్థితులు పనిచేయునట్లు దేవుడు అతనికి తోడుగా ఉన్నాడు. పరిస్థితులు ఏవిధముగా ఉన్నప్పటికి చివరికి దేవుడే అతనికి జయమును అనుగ్రహించాడు. "చెరసాల అధిపతి ఆ చెరసాలలో ఉన్న ఖైదీలనందరిని యోసేపు చేతికప్పగించెను. వారక్కడ ఏమి చేసిరో అదంతయు అతడే చేయించువాడు" (ఆది 39:23). ఎవరికి ఏ వరము ఉన్నప్పటికి, ఎవరు ఎంత విజయవంతముగా పనిచేసినప్పటికి, అంతిమముగా అది అంతయు దేవుని యొద్ద నుండి వచ్చుచున్నదని మనము గుర్తుంచుకోవాలి.

**ఆది 39:7-12 చదువుడి. పోతీఫరు భార్య యోసేపును శోధించినపుడు అతడు ఆ పరిస్థితిని ఏవిధముగా ఎదుర్కొన్నాడు? ఆమె అడిగిన విషయాన్ని నెరవేర్చిన యెడల అది దేవునికి వ్యతిరేకముగా చేసిన పాపమగునని ప్రత్యేకించి యోసేపు ఎందుకు భావించెను? పాపమంటే ఏమిటి? దాని స్వభావమును గూర్చి అతడెట్టి అవగాహన కలిగియున్నాడు?**

గురువారం జూన్ 9

## ఫరో యొక్క కలలు

**ఆది 40:1-41 చదువుడి.** ఫరోకు కలిగిన కలలు అధికారులకు వచ్చిన కలలకు ఎట్టి సంబంధమున్నది? ఈ సాదృశ్యము యొక్క ప్రాధాన్యత ఏమిటి?

..........................................................................................

అక్కడ జరుగుచున్న సంఘటనలు దైవానుగ్రహము వలన జరుగుచున్నట్లున్నవి. ఫరో రాజు యొక్క ఇద్దరు ఉద్యోగులు చెరసాలలో బంధింపబడిరి. అదే చెరసాలలో యోసేపు కూడా బంధింపబడెను. ఫరో ఉద్యోగులలో ఒకడు పానదాయకుడు, మరొకడు భక్ష్యకారుడు. రాజ సంరక్షక సేనాధిపతి ఆ ఉద్యోగులిరువురిని యోసేపు వశమున ఉంచెను (ఆది 41:9-11). చెరసాలలో బంధింపబడిన ఆ ఉద్యోగులిరువురికి కలలు

వచ్చినవి. అయితే వాటి భావము వివరించేవారు లేకపోవుట వలన వారికి వారి కలల భావము తెలియుటలేదు (ఆది 40:8). వారిరువురి కలలను వేరువేరుగా యోసేపునకు వివరించి చెప్పెను.

చెరసాలలో ఉన్న ఇద్దరు అధికారులకు వచ్చిన రెండు కలల వంటి కలలు ఈసారి ఫరో రాజుకు వచ్చినవి. ఇద్దరు అధికారులు వారి కలలను గూర్చి ఆందోళన చెందినట్లు ఫరో రాజు కూడా వాటి భావము తెలిపేవారు లేక ఆందోళన చెందుతున్నాడు. (ఆది 4:1-8) ఆ సమయమున పానదాయకుల అధిపతి యోసేపును రాజు గారికి సిఫారసు చేసెను (ఆది 41:9-13). అంతట యోసేపు ఫరో రాజు కలలను భావమును వివరించెను. (ఆది 41:14-24). ఇద్దరు అధికారులకు వచ్చిన కలలో చిహ్నములున్నట్లు ఫరోకు వచ్చిన కలలో కూడా చిహ్నములున్నవి. ఏడేసి చొప్పున రెండు గుంపుల ఆవులు కనిపించెను. మొదటి గుంపు ఆవులు 7 బలిసినవి. చూపునకు అందమైనవి. రెండవ గుంపుకు చెందిన 7 ఆవులు చిక్కిపోయి వికారముగానున్నవి. అదేవిధముగా మరొక కలలో పుష్టి గల 7 మంచి వెన్నులు ఒక్కదంటున పుట్టెను. చెడిపోయిన-ఎండిన పీల వెన్నులు తరువాత మొలిచెను?

యోసేపు ఫరో కలను వివరిస్తూ : 7 మంచి ఆవులు 7 సంవత్సరములు 7 మంచి వెన్నులు 7 సంవత్సరములు. అదేవిధముగా చిక్కిన వికారము గల ఆవులు 7 సంవత్సరములు. అట్లే చెడిపోయిన 7 పీల వెన్నులు 7 సంవత్సరాలను సూచించును. ఈ రెండు కలలు సమాంతరముగా ఉన్నవి. ఈ కార్యములన్నియు కూడా దేవుని అనుగ్రహము వలన తెలియజేయబడిన వర్తమానము (ఆది 41:32ను 37:9తో పోల్చుడి).

ఫరో యొక్క కలను వివరించినది యోసేపు అయినను ఆ వివరణ దేవుని ఎలోహిమ్ వలన ఫరోకు తెలియజేయబడినదని ఫరో గ్రహించాలని యోసేపు యొక్క ఉద్దేశమైయున్నది. దేవుడేమి చేయబోవుచున్నాడో వాటిని తన దాసుడైన యోసేపు ద్వారా ముందుగానే తెలియపర్చాడని ఫరో తెలుసుకున్నాడు (ఆది 41:25,28). అందువలననే ఆ పరిస్థితులను ఎదుర్కొనుటకు మనుష్యులను సిద్దము చేయుటకు సమయము వచ్చినపుడు రాజు ఈవిధముగా చెప్పెను. "ఫరో - దేవుడు ఇదంతయు నీకు తెలియపరచెను గనుక నీవలె వివేక జ్ఞానములు గలవారెవరును లేరు. నీవు నా యింటికి అధికారివై యుండవలెను. నా ప్రజలందరు నీకు విధేయులై యుందురు" (ఆది కా. 41:39,40) అని ఫరో యోసేపునకు చెప్పెను.

ఎంత ఆసక్తికరమైన విషయము : యోసేపు పోతీఫరు ఇంటి మీద విచారణకర్తగా

(అధికారిగా) నుండి చెరసాల అధికారిగా వెళ్ళి అక్కడ నుండి ఐగుప్తు అంతటి మీద అధికారి అయ్యాడు. పరిస్థితులు ఎంతో బాధాకరముగా ఉన్నప్పటికి దేవుని యొక్క అనుగ్రహము చొప్పున ఆయన ఏమి దాచి యుంచాడో వాటిని బయలుపర్చాడు.

**దేవుడు నెమ్మదిగా ఉన్నాడు ఆయన అనుగ్రహము మన మీద లేదని అనిపించినా పరిస్థితులలో దేవుని మీద ఆయన వాగ్దానము మీద ఎట్లు నమ్మకముంచగలము?**

శుక్రవారం జూన్ 10

**అదనపు అధ్యయనము**

ఎలెన్ జి వైట్ పితరులు మరియు ప్రవక్తలు పుటలు 213-223లో ఉన్న "ఐగుప్తులో యోసేపు చదువుడి".

యోసేపు మరియు దానియేలు యౌనవ ప్రాయము నుండి పెద్ద వారుగా ఎదుగుచున్న సమయములోనే వారి గృహాల నుండి వేరు చేయబడి, అన్య దేశాలలోనికి, బానిసలుగా కొనిపోబడిరి. ముఖ్యముగా యోసేపునకు కలిగిన శోధనలలో అతని జీవితము ఎన్నో మలుపులు తిరిగినది. తన తండ్రి యింట ఎంతో ఆప్యాయముగా పెరిగినవాడు పోతీఫరు ఇంటిలో బానిసగా పనిచేసి ఆ గృహ యజమాని నమ్మకమును పొందిన పరిశీలన, మరియు పరిచయాల ద్వారా చదువుకున్నవాడు. రాజ సంరక్షక చెరసాలలో అన్యాయముగా ఇరికించబడినవాడుగా చెరసాల నుండి విడుదలకు అవకాశములేని పరిస్థితులలో దేశము గొప్ప సంక్షోభములో ఉన్నపుడు ఆ దేశమును పరిపాలించే అధిపతిగా హెచ్చింపబడ్డాడు. అంత నమ్మకము ఎట్లు సంపాదించాడు.

"తన బాల్యదశలో యోసేపు, తన తండ్రి యొద్ద ప్రేమ, దేవుని యెడల భయమును గూర్చి నేర్చాడు. అనేకసార్లు రాత్రులందు సిరియా దేశములో నక్షత్రాల వెలుగులో బేతెలు యొద్ద కలిగిన దైవ దర్శనమును గూర్చి పరలోక ద్వారమును అందుకున్న నిచ్చెన గూర్చి దాని మీద దూతలు ఎక్కుచు, దిగుచూ ఉన్న దృశ్యమును గూర్చి యాకోబుకు వివరించబడిన విషయాలన్నిటిని గూర్చి తెలుసుకున్నాము. యబ్బోకు యొద్ద జరిగిన పెనుగులాటను గూర్చి తెలుసుకుంటాడు. ఆ పెనుగులాటలో తొలి విజయము సాధించి దేవునితో ఉన్న రాజుగా ఒక హోదాను పొందియున్న విషయాలు తెలుసుకుంటాడు.

"తన తండ్రి గొఱ్ఱెల మందను కాసే సున్నితమైన బాలుడుగా యోసేపు శారీరకముగాను, మానసికముగాను ఎదుగుతున్నాడు. ప్రకృతి ద్వారా గొప్ప సత్యములను

నేర్చుకొనుట ద్వారా దేవునితో సంభాషించేవాడు. తండ్రి నుండి కుమారుడు అభ్యసించినట్లు గొప్ప జీవిత సత్యాలను నేర్చుకున్నాడు.

తన జీవితములో ఎదురైన సంక్షోభ సమయాన్ని కానానులో ఉన్న తన కుటుంబ సభ్యుల గుడారములను ఆ కొండల మీద చివరిసారిగా చూచినపుడు, యోసేపు తన తండ్రి యొక్క దేవునిని చూసాడు. తన బాల్యదశలో నేర్చుకున్న పాఠములను తన హృదయవాంఛను జ్ఞాపకము చేసుకున్నాడు. ఎల్లపుడు పరలోక రాజు యొక్క పౌరునిగా ఉండాలని కోరుకున్నాడు – ఎలెన్ జివైట్, విద్య, పుటలు 51,52.

**చర్చించుకొనుటకు ప్రశ్నలు :**

1. యోసేపును దానియేలు మరియు యేసుతో పోల్చి చూడుము. వారిలో ఉన్న సాదృశ్యము ఏమిటి? యేసు ఈ విధముగా ఉంటాడనుకొనుటకు యోసేపు దానియేలు వారి సొంత విధానములో ఏమి బయలుపర్చారు?
2. మీ తరగతిలో గురువారం పాఠంలోని చివరి ప్రశ్నను గూర్చి చర్చించుడి. యోసేపునకు కలిగినట్లు అన్ని విషయాలు అతనికి అనుకూలముగా లేకున్నను అతడు దేవుని నమ్మినట్లు మనము కూడా దేవుని నమ్ముటకు ఎట్లు నేర్చుకొనగలము?

❖❖❖